క్లుప్తంగా

పీహెచ్‌సీలో చిన్నపిల్లల వైద్యుడి నియామకం


డాక్టర్ దిలీప్ గుప్తా

సుండుపల్లె : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చిన్నపిల్లల వైద్యుడిగా దిలీప్ గుప్తా నియమితులయ్యారు. ఈయన మే నెలలో 5500 డాక్టర్లు దరఖాస్తు చేసుకొని రాష్ట్ర స్థాయి ఎంపికలో 10వ ర్యాంకు సాధించారు. ఆయనకు వైద్య శాఖ అధికారులు సుండుపల్లెకు పోస్టింగ్ వేశారు. బుధవారం ఆయన బాధ్యతలు తీసుకొని మాట్లాడారు. మండలంలోని చిన్నపిల్లలకు మెరుగైన వైద్యం అందించడమే తన ధ్యేయమని ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి పరీక్షలో విద్యార్థిని సత్తా


శ్వేత, 809వ ర్యాంకు

సిద్దవటం : మాధవరం-1 గ్రామ శివారులో ఉన్న శ్రీ వాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ కళాశాల విద్యార్థిని పి.శ్వేతకు జాతీయ స్థాయి పరీక్ష జీపీఏటీ – 2025లో 809వ ర్యాంకు సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థిని శ్వేత జాతీయ స్థాయిలో 809వ ర్యాంకు సాధించడం వల్ల సంతోషంగా ఉందన్నారు. అనతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రదీప్‌కుమార్‌తో పాటు ఎన్.ఎస్.ఎస్. అధికారి బి.జగదీష్‌బాబు, ఫ్యాకల్టీలు ర్యాంకు సాధించి విద్యార్థిని శ్వేతకు శుభాకాంక్షలు తెలిపారు.

అనారోగ్యానికి గురైన ఆవుకు శస్త్ర చికిత్స



చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామం కదిరివాండ్లపల్లెకు చెందిన వెంకట్రామిరెడ్డి ఆవు అనారోగ్యానికి గురికావడంతో శస్త్ర చికిత్స చేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ భాస్కర్ తెలిపారు. ఆవు మామిడికాయలు తిని అనారోగ్యానికి గురికావడంతో పాడి రైతు వైద్యుడి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన పశువైద్యాధికారి శస్త్ర చికిత్స చేసి పదికి పైన మామిడి టెంకలు బయటకు తీశారు. పాడి రైతులు పశువులకు ఎక్కువ మొత్తంలో మామిడికాయలు పెట్టవద్దని పశువైద్యాధికారి డా.భాస్కర్ తెలియజేశారు.

పోషకాహారం తీసుకోవాలి

గాలివీడు : పోషకాహారంతో బాలింతలు గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత తలెత్తకుండా చూడవచ్చని అతెర సోలార్ కంపెనీ ప్రతినిధి శిరీష, ప్రేరణ సంస్థ రీజనల్ కో–ఆర్డినేటర్ స్వర్ణలతలు తెలిపారు. బుధవారం మండలంలోని తూముకుంట గ్రామంలో గర్భిణులు, చిన్నారుల్లో వచ్చే రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులు రక్తహీనత నుంచి బయట పడటానికి గానూ రాగిపిండి, గుడ్లు, పాలు, కర్జూరాలు, బెల్లం, వేరుశనగ చిక్కీలు, అటుకులు, ఆకుకూరలతో వండిన కూరలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎం శిక్షణకు ఉపాధ్యాయులు హాజరవ్వాలి

సిద్దవటం : ఎఫ్ఎల్ఎం శిక్షణకు మండలంలోని ఉపాధ్యాయులందరూ హాజరయ్యేలా చూడాలని సిద్దవటం ఎంఈఓలకు సూచించామని సమగ్ర శిక్ష అభియాన్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి వీరేంద్ర తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంఈఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండల వ్యాప్తంగా పిల్లల ఎన్‌రోల్‌మెంట్ ఎంత ఉందో అడిగి తెలుసుకున్నారు. సర్వేపల్లె రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ విద్యార్థులందరికి అందాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. పాఠశాలలో హెడ్ టీచర్‌లు, ప్రధానోపాధ్యాయుల అకౌంట్లను చేయించాలని సూచించామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 పద్మజ, ఎంఈఓ-2 అరుణ, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

సుండుపల్లె : ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు వాడటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ దిలీప్ గుప్తా అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు – ఉపయోగాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎటువంటి రసాయనిక పురుగు మందులు వాడకుండా, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిన కూరగాయలు, ఆకుకూరలు వాడటం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. మండలంలోని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండించాలని కోరారు. ప్రతి బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. ఇందులో మోడల్ మేకర్లు రామాంజనేయులు, వీర నాగయ్య, యూనిట్ ఇంచార్జ్‌లు రామమోహన్, ఆంజనేయులు, వెంకటయ్య, సీడీఎఫ్ రమేష్, ఐసీఆర్‌పీలు కొండమ్మ, సుమలత, లక్ష్మీ, మజ్జారూన్, నాగలక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ కోసం అష్టకష్టాలు!



జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఆధార్ కేంద్రం వద్ద కిక్కిరిసి ఉన్న ప్రజలు

- కేంద్రాల చుట్టు రోజూ ప్రజల ప్రదక్షిణలు
- సవరణల కోసం గంటల కొద్దీ సమయం
- పట్టణంలో కేంద్రాల సంఖ్య పెంచాలని డిమాండ్

రాయచోటి జగదాంబ సెంటర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరైంది. దీంతో పాటు ఆధార్ పొంది పదేళ్లు పూర్తయిన వారికి అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇవే కాకుండా ఏ ఇతర గుర్తింపు కార్డులు పొందాలన్నా, వృద్ధులు బస్సుల్లో ప్రయాణించాలన్నా, విద్యార్థులు స్కూళ్లలో చేరాలన్నా, పై చదువులు చదవాలన్నా ఆధార్ అవసరమైంది. ఈ ఆధార్‌కార్డు వాడుకలో ఉంటేనే మనిషి బతికిన్నట్లు లెక్క. ఈ ఆధార్ కార్డుల్లో పేరు, అడ్రస్, ఫోన్ నెంబర్ మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్ నూతన కార్డులు తదితర సేవల కోసం ప్రజలు నిరంతరం ఆధార్ కేంద్రాలకు వస్తున్నారు. వీరు అరకొర ఆధార్ సెంటర్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రాయచోటి పట్టణంలో ప్రధానంగా ఆంధ్రా బ్యాంకు, స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్, పోస్టాఫీస్ ప్రధాన కేంద్రాలలో ఆధార్ సెంటర్ల వద్ద ప్రజలు గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. పట్టణ ప్రజలే కాకుండా సమీప గ్రామాలు, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఆధార్ కేంద్రాలకు చేరుకుంటున్నారు. వీరంతా ఉదయం 7 గంటల నుంచే బారులు తీరుతున్నారు. ఎవరు ముందు వస్తే వారికే లక్కీడిప్ తరహాలో టోకెన్‌లు ఇస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి మిగిలిన వారికి రిక్తహస్తం చూపిస్తున్నారు. 30 మంది పనులన్నీ మానుకొని రోజంతా ఈ పనికే కేటాయించి వేచి చూడాల్సి వస్తోంది. అంతా వీలు చూసుకొని ఆధార్ కేంద్రాల వద్ద నిరీక్షిస్తుంటే సర్వర్ డౌన్ అని చెప్పడంతో రోజంతా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. గత కొద్ది రోజుల ముందు స్కూల్స్ ప్రారంభం కావడం తల్లికి వందనం పథకానికి ప్రభుత్వం డబ్బులు అకౌంట్లలో జమచేస్తుంది. వీరిలో కొంత మంది విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ అవ్వలేదని, అందుకే అకౌంట్లో డబ్బులు పడలేదని చెప్పడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. వృద్ధులు వేలిముద్రలు సరిగా పడటం లేదని వారు పింఛన్ డబ్బులు తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. వారికి మరలా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకొని కొత్త కార్డు తీసుకోవాల్సి రావడంతో అవస్థలకు గురవుతున్నారు.

ఏయూలో చేరే విద్యార్థులకు రుణ సదుపాయం

అన్నమాచార్య యూనివర్శిటీ ఛాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి



రాజంపేట : అన్నమాచార్య యూనవర్శిటీ(ఏయూ)లో నూతనంగా ఇంజనీరింగ్ విద్యలో చేరే పేద విద్యార్థులకు రుణ సదుపాయం కల్పించే విధంగా, బ్యాంకులను సంప్రందించామని ఏయూ ఛాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన తన చాంబరులో విలేకర్లతో మాట్లాడారు. కొత్తగా కళాశాలలో చేరుతున్న విద్యార్థులకు ఫీజులు కట్టేందుకు ఇబ్బందులు పడకుండా తమ సంస్థకు అనుకూలంగా బ్యాంకుల నుంచి రుణ సహాయం చేయించేలా సంబంధిత బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడామన్నారు. వారు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. విద్యార్థులకు రుణసాయం త్వరగా ఇచ్చేవిధంగా బ్యాంకులు రూపకల్పన చేయాలన్నారు. ఇందు కోసం కళాశాల చేరే సమయంలో యూనవర్శిటీ క్యాంపస్‌లో బ్యాంకుల కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసుకోమన్నారు. అన్నమాచార్య యూనవర్శిటీ విద్యార్థులు అమెరికా, స్విట్జర్లాండ్ తదితర దేశాలలో చదువుకునేందుకు గ్లోబల్ ఎడ్యుకేషన్ కేరీర్స్ ఫోరం లాంటి సంస్థలతో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. అంతే గాకుండా విదేశాలలో ఉచితంగా చదువుకొనే అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం రాజంపేట ప్రాంతానికి చెందిన న్యాయ కళాశాల తీసుకొచ్చిన ఏయూ ఛాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డిని బుధవారం ఆల్ ఇండియా నేషనల్ ఓబీసీ ఫ్రంట్ కన్వీనరు కేఎంఎల్ నరసింహా సత్కరించారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఏయూ అధ్యాపకులు పాల్గొన్నారు. అలానే ఈ – కామర్స్, బ్యాంకింగ్ వ్యూహాలపై ప్రిన్సిపల్ డా.డీజే సమతా నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరెడ్డి రూపొందించిన పుస్తకాన్ని చొప్పా గంగిరెడ్డి ఆవిష్కరించారు. వేగంగా మారుతున్న డిజిటల్ ప్రపంచంలో బ్యాంకులుఎలా అనుకూలించాలో ఈ-కామర్స్ రంగంతో కలిసి ఎలా విజయవంతంగా ముందుకు సాగాలో ఈ పుస్తకం ద్వారా తెలియజేశారు. వీసీ డా.సాయిబాబారెడ్డి, డీడీ అడ్మిషన్స్ డా.జయరామిరెడ్డి, యూనియన్ బ్యాంకు ప్రాంతీయ సంచాలకులు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం పాశెంగడ్డ పాపన్నగారిపల్లె ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు రాయచోటి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మనోజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.


విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఒంటిమిట్ట అభివృద్ధికి ఎంపీ మేడా నిధులు


మేడా రఘునాథ రెడ్డి, రాజ్యసభ సభ్యులు

ఒంటిమిట్ట : మండల అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి రూ.1.01 కోట్ల (ఒక కోటి లక్షా యాభై వేలు) నిధులను బుధవారం మంజూరు చేసినట్లు రాజంపేటలోని ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. పంచాయతీల వారీగా మంజూరైన నిధుల వివరాలు కోనరాజుపల్లిలోని అశ్వర్థ నారాయణ చెరువుపై ట్యాంక్ బండ్ నిర్మించేందుకు రూ.10 లక్షలు, సాలాబాదు సచివాలయానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, రాచపల్లి సచివాలయానికి కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు రూ.5 లక్షలు, మలకాటిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ.5 లక్షలు, రాయగూడిపల్లి పాత ఎస్సీ కాలనీలో బోర్ వెల్ వేసేందుకు రూ.3.5 లక్షలు, నడింపల్లి స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ పనుల నిమిత్తం రూ.5 లక్షలు, మంటపంపల్లిలోని అసంపూర్తిగా ఉన్న స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ పూర్తి చేసేందుకు రూ.5 లక్షలు, గంగపేరూరు గ్రామ సచివాలయం చుట్టూ అసంపూర్తిగా ఉన్న కాంపౌండ్ వాల్‌ను పూర్తి చేసేందుకు రూ.6 లక్షలు, కొత్తమాధవరంలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.5 లక్షలు, ఒంటిమిట్టలో సీసీ రోడ్లు వేసేందుకు రూ.5 లక్షలు, కటికవారిపల్లి బోర్‌వెల్ పనులు, దర్జిపల్లి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులకు, పెన్నపేరూరు గ్రామం నుంచి నరసన్నగారిపల్లి వరకు మెటల్ రోడ్డు పనులకు, మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని షాదీఖానా పునరుద్ధరణకు, ఒంటిమిట్టలోని దోబీఘాట్ వద్ద బోర్ వెల్ కోసం, కొత్తమాధవరం గ్రామం నుంచి కొత్తమాధవరం స్మశాన వాటిక వరకు మెటల్ రోడ్డు నిర్మించేందుకు, ఒంటిమిట్టలోని కోదండరామ నగర్‌లో సీసీ రోడ్డు వేసేందుకు, కటికవారిపల్లి మెటల్ రోడ్డు పనులు, కొండమాచుపల్లి స్మశానంలో రూమ్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. ఒంటిమిట్ట అభివృద్ధికి రాజ్యసభ నిధులను మంజూరు చేసిన ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డికి ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

‘ఆకలి బాధల నుంచి ఆదుకోండి’

- సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌ఏల ధర్నా
- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సబ్ కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్‌కు వినతి


రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు


సబ్‌కలెక్టరేట్ ఏఓ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

రాజంపేట : వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఎదుట నిర్వహించారు. ఈ ధర్నాకు ఎనిమిది మండలాల నుంచి గ్రామ సేవకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తామన్న కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఏడాది గడిచిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదన్నారు. ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగలేదన్నారు. చదువుకున్న వీఆర్‌ఏలకు ఎప్పుడు పదోన్నతులు వస్తాయో ప్రశ్నార్థకంగా ఉందన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలన్నారు. పదోన్నతుల కోసం ఎదురుచూసి వీఆర్‌ఏలకు వయోభారం పెరుగుతోందన్నారు. దళిత, గిరిజన, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల వీఆర్‌ఏల కుటుంబాలను ఆకలి బాధల నుంచి ఆదుకోవాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పేస్కేలు అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటెండర్, నైట్ వాచ్‌మెన్, డ్రైవర్ల పదోన్నతుల శాతాన్ని 20 నుంచి 70 శాతంకు పెంచాలన్నారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవి కుమార్ మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయకుండా, గౌరవ వేతనం రూ.10,500తో వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. తల్లికి వందనం, సంక్షేమ పథకాలకు వీఆర్‌ఏ కుటుంబాలకు వర్తింపజేసేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. వచ్చే నెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ల మణి, వీఆర్‌ఏ రాజంపేట డివిజన్ అధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి కొరముట్ల సుధాకర్, రైల్వేకోడూరు కార్యదర్శి కలిశెట్టి లక్ష్మీకర్, బత్తిన సుబ్రమణ్యం, నాగరాజు, బలరాం, ఓబులవారిపల్లె మండలానికి చెందిన మోడీ ప్రసాద్, రాంప్రసాద్, సుబ్రమణ్యం, లావణ్య, పుల్లంపేటకు చెందిన వెంకటసుబ్బయ్య, శివయ్య, హరి, శ్రీను, వెంకటయ్య, చిట్వేలికి చెందిన సుబ్బరాయుడు, చక్రపాణి, వెంకటరమణ, పెనగలూరుకు చెందిన మల్లి, కరీముల్లా, సుమలత, రాజంపేటకు చెందిన నరసింహులు, రమణయ్య, నందలూరుకు చెందిన రత్న, నరసింహులు, హరి, శ్రీను, పెంచల ప్రసాద్, సుండుపల్లెకు చెందిన నాగరాజు, అల్లాబకాష్, రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని వీఆర్‌ఏలు అందజేశారు.

అమ్మవారికి అమావాస్య పూజలు

చిట్వేలి : చిట్వేలిలోని ఆలయాల్లో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. పాత చిట్వేలిలో వెలసివున్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. లలాగే బ్రాహ్మణ వీధిలో వెలసి ఉన్న మారెమ్మ ఆలయంలో అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని కుంకుమ, చందనాలతోపాటు కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గర్భిణులకు అబా రిజిస్ట్రేషన్ తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లి : గర్భిణీ స్త్రీలకు అబా రిజిస్ట్రేషన్ చేయాలని మండల మెడికల్ ఆఫీసర్ రిజ్వాన్ బేగ్ పేర్కొన్నారు. బుధవారం కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను గుర్తించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. వారికి నెలకు సరిపడా మందులను అందజేయాలన్నారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి రక్త పరీక్షలు చేయించి మందులు అందించాలని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కింద వంద రోజుల ప్రోగ్రామ్‌లో క్షయ వ్యాధులను గుర్తించి వారికి చికిత్స నిర్వహించి మందులు అందేటట్లు చూడాలన్నారు. ఈ వర్షాకాలంలో జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఇంటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవీంద్ర, సూపర్‌వైజర్ సరస్వతీ, సిహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రతి రైతు పంట మార్పిడి పాటించాలి

చిట్వేలి : చీడపీడలను తగ్గించడానికి ప్రతి రైతు పంట మార్పిడిని పాటించాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ సూచించారు. మండలంలోని నాగవరం, సీఎం రాచపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సుధాకర్ మాట్లాడుతూ మార్కెట్‌లో ఒడిదుడుకులు తట్టుకునేందుకు బహుళ పంటలు సాగు చేయాలని, మిశ్రమ పంటలు, అంతర పంటలు వేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. వరిసాగులో కాలిబాటలు పాటించడం, దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయడం, వరి నాటేటప్పుడు కొనలు తుంటడం వంటి పనులు చేయడం ద్వారా చీడపీడలను నివారించడంతోపాటు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. బొప్పాయిలో పూతరాలడం తగ్గించడానికి 13-0-45ను లీటర్ నీటికి 10 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని ఏఓ సుధాకర్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ వెంకటాద్రి, రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్

గాలివీడు/లక్కిరెడ్డిపల్లి/పెనగలూరు : ఈ నెల 26వ తేదీ (నేడు) నుంచి 31వ తేదీ వరకు రేషన్ డీలర్లు 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటి వద్దే రేషన్ అందించాలని ఆయా మండలాల తహసీల్దార్లు భాగ్యలత, ఎన్.క్రాంతికుమార్, అమరేశ్వరిలు ఆదేశించారు. బుధవారం వారు ఆయా మండల కేంద్రాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్‌ను తప్పక ఇంటి వద్దే అందజేయాలన్నారు. అలానే వేలిముద్రలు పడని వారికి తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలను సూచించారు. ఒకటో తారీఖు నుంచి సాధారణంగా మిగతా కార్డుదారులకు 15వ తేదీ వరకు పంపిణీ చేపట్టాలని తెలియజేశారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్ క్రాంతి కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ వెంకటరెడ్డిలను దుశ్శాలువాలతో రేషన్ డీలర్లు సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె డీటీ రెడ్డన్న, ఆర్ఐ రాజేష్, పెనగలూరు మండలంలో ఆర్ఐ రామ్మోహన్, గాలివీడు మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


సంబేపల్లె: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


చిట్వేలి: బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి/సంబేపల్లె : బదిలీపై ఉపాధ్యాయులను చిట్వేలి జెడ్పీహెచ్ఎస్‌లో, సంబేపల్లె మండలం మోటకట్ల జెడ్పీహెచ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని దానిని సక్రమంగా నిర్వహించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులను మరువలేమన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుతోనే ఉపాధ్యాయులకు సంతోషం ఉంటుందన్నారు. బదిలీ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న పాఠశాలలో మంచి పేరు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులను పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి రోజు



రాజంపేట టౌన్: విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట టౌన్ : సరిగ్గా యాభై ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ పాలనలో విధించిన ఎమర్జెన్సీ భారతదేశానికి చీకటి రోజు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు రమేష్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1975వ సంవత్సరం జూన్ 25వ తేదీ భారతదేశంలో అత్యవసర పరిస్థితి విధించబడిందని ఇది ప్రజాస్వామ్యంపై అతిపెద్ద దాడి అన్నారు. పదవీ కాంక్షతో ఎమర్జెన్సీ విధించిందని తెలియజేశారు. అందువల్ల 21 నెలల పాటు భారతదేశంలో చీకటిలో పాలన సాగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజ్యాంగాన్ని అవమానపరిచారు

రాయచోటి టౌన్ : నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరిచారని రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ఒక కుటుంబం ఏక ఛత్రాధిపత్యంగా పరిపాలించాలని భావించారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ఆరోపించారు. బుధవారం రాయచోటి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరం సమీపాన ఉన్న అర్చనా విద్యాసంస్థలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాటి పాలకులు వ్యవస్థలను తమకు అనుకూలంగా మార్చుకొని మూడు లక్షల మందిప్రజాస్వామ్య వాదులను జైళ్లలో బంధించి నియంతృత్వాన్ని ప్రదర్శించారన్నారు.

డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనం



లక్కిరెడ్డిపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్

సిద్దవటం : డ్రగ్స్ వాడటం వల్ల చాలా మంది యువత తమ పచ్చటి జీవితాలను కోల్పోతున్నారని సిద్దవటం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సీఐ రాజశేఖర్ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ అమీర్‌ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశపురోగతికి యువశక్తి అవసరం

లక్కిరెడ్డిపల్లి : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో తొమ్మిది, పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మత్తు పానీయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రతి దేశానికి శక్తి కేంద్రం లాంటివారని, యువ శక్తి సమాజ అభివృద్ధికి, దేశ పురోగతికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్, ఎక్సైజ్ సిబ్బంది గీత, విజయ్ కుమార్, ఉమా, మహేష్ కుమార్, రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ


విద్యా సాగర్‌నాయుడు, ఎస్పీ ,అన్నమయ్య జిల్లా

రాయచోటి : నేడు (గురువారం) రాయచోటిలో (యాంటీ డ్రగ్స్ అబ్యూస్) అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, వాటి వలన కలిగే దుష్ప్రభావాలపై ప్రజలు, యువతకు అవగాహన కల్పించాలని ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు, ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యం అవుతాయని పేర్కొన్నారు. ర్యాలీ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ర్యాలీలో భాగంగా రాయచోటి పట్టణంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రత్యేక ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. రాయచోటి పట్టణంలోకి ప్రవేశించాలన్నా, పట్టణంలో నుంచి బయటికి వెళ్లాలన్నా గాలివీడు రింగ్‌రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు. రింగ్ రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులకు ఎలాంటి అంక్షలు లేవన్నారు. రాయచోటి ప్రధాన రహదారులైన కడప రింగ్ రోడ్డు నుంచి, చిత్తూరు రింగ్ రోడ్డు మదనపల్లె రింగ్ రోడ్డు, రాయచోటి పట్టణంలోకి ఎటువంటి వాహనలకు ప్రవేశం లేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలని కోరారు.